సాక్షి రంగారెడ్డి

శనివారం, 3, ఫిబ్రవరి, 2024



‘దేవుడి భూములనూ..

బీఆర్‌ఎస్ నేతలు హనుమాన్ దేవాలయాన్ని కూల్చివేసి ఆ భూమిని కబ్జా చేశారని మాజీ ఎంపీ కొండా ఆరోపించారు. 8లో▸



సొత్తు అందజేత

కారులో పోగొట్టుకున్న విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, బాధితురాలికి అప్పగించారు. 8లో▸



ఉత్తమ్‌కు ఘన స్వాగతం

వనపర్తి జిల్లాలో కాంగ్రెస్ నిర్వహించే రోడ్‌షోకు వెళ్తున్న మంత్రి ఉత్తమ్‌ని ఎమ్మెల్యే శంకర్ ఘనంగా సన్మానించారు. 8లో▸

న్యూస్‌రీల్

టీటీడీ సదస్సుకు రండి

మొయినాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న సనాతన ధార్మిక సదస్సుకు చిలుకూరు బాలాజీ దేవాలయం అర్చకుడు రంగరాజన్‌కు ఆహ్వానం అందింది. టీటీడీ సారథ్యం వహిస్తున్న భక్తి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ‘ఆధ్యాత్మిక గురు’ కేటగిరీ కింద రంగరాజన్‌ను టీటీడీ ఆహ్వానించింది. తనను ఆహ్వానించిన టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న గీతారెడ్డి

శంకర్‌పల్లి: నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి స్పష్టం చేశారు. శంకర్‌పల్లి మండల పరిధిలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం ఆమె తనిఖీలు నిర్వహించారు. స్టాక్ రికార్డులను, బిల్లులను పరిశీలించారు. ప్రతి షాపు యాజమాని తప్పనిసరిగా రికార్డులను మెయింటెన్ చేయాలని, రైతులకు విక్రయించిన ఎరువులు, విత్తనాలకు సంబంధించి తప్పక రసీదులు అందించాలని తెలిపారు. అధిక ధరకు విత్తనాలు, ఎరువులను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శంకర్‌పల్లి మండల వ్యవసాయాధికారి సురేష్‌బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా కల్యాణ్ నాయక్



కల్యాణ్ నాయక్‌ను సన్మానించిన ఆచారి, నాయకులు

ఆమనగల్లు: బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా డా.కల్యాణ్ నాయక్ శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. కల్వకుర్తి నియోజకవర్గానికి చెందిన కల్యాణ్ నాయక్‌ను నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత ఆచారి, ఆ పార్టీ నాయకులు అభిలాష్‌రెడ్డి, శంకర్‌నాయక్, బ్రహ్మచారి, పరమేష్, సాయిలాల్, మన్యనాయక్, రెడ్యా నాయక్, రవిరాథోడ్, ప్రేమ్ పాల్గొన్నారు.

‘కుసుమ’ సాగుతో లాభాలు

కొత్తూరు: సాంప్రదాయ పంటలకు బదులుగా మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేస్తే మంచి లాభాలు వస్తాయని జయశంకర్ వ్యవసాయ వర్సిటీ శాస్త్రవేత్తలు సుధాకర్, రాజేశ్వర్‌రెడ్డి, రమేష్ అన్నారు. వర్సిటీ వారు దత్తత తీసుకున్న కొత్తూరు మండలంలోని మల్లాపూర్ గ్రామంలో పలువురు రైతులు సాగుచేసిన కుసుమ పంటను శుక్రవారం వారు పరిశీలించారు. సాగులో అనుసరించాల్సిన పద్ధతులపై రైతులకు సలహాలు అందజేశారు. వానాకాలంలో రైతులు సాగుచేసే మొక్కజొన్న పంట తర్వాత కుసుమ పంటను సాగుచేస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. గ్రామంలో సుమారు 70 ఎకరాల్లో సాగుచేస్తున్న కుసు మ పంట విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు వివరించారు. రైతులు పాల్గొన్నారు.

డీసీసీ ఉపాధ్యక్షుడిగా వెంకశ్వర్లుగౌడ్



నియామకపత్రం అందుకుంటున్న వెంకటేశ్వర్లుగౌడ్

మాడ్గుల: మాడ్గుల మండలం సుద్దపల్లికి చెందిన వెంకటేశ్వర్లు గౌడ్ రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈమేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి శుక్రవారం వెంకటేశ్వర్లు గౌడ్‌కు నియామకపత్రం అందజేశారు. అనంతరం నగరంలోని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి ఇంటికి వెళ్లిన వెంకటేశ్లర్లుగౌడ్‌ను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచందర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బాలజీ సింగ్, జిల్లా అధ్యక్షుడునర్సింహారెడ్డికి.. వెంకటేశ్వర్లు గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

టీచర్ల నగరబాట!

- పల్లె పాఠశాలల్లో బోధించేందుకు ఆసక్తి చూపని ప్రభుత్వ ఉపాధ్యాయులు
- డిప్యుటేషన్‌పై శివారు పాఠశాలలకు
- టీచర్లు లేకపోవడంతో బడిమానేస్తున్న విద్యార్థులు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు



ఫరూఖ్‌నగర్ మండలం తోకరేగడి తండాలో మూతపడిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న మెజార్టీ ప్రభుత్వ ఉపాధ్యాయులు హైదరాబాద్ నుంచి నిత్యం ప్రయాణం చేసి ఇక్కడకు వస్తుంటారు. అయితే వారు తమ ప్రయాణ దూరాన్ని తగ్గించుకునేందుకు డిప్యూటేషన్‌ను ఎంచుకుంటున్నారు. ఈ క్రమంలో గ్రామాల్లో పాఠాలను బోధించాల్సిన వారు తమకు సమీపంలో ఉన్న పాఠశాలలకు డిప్యూటేషన్‌పై వెళ్తున్నారు. ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో బోధనా సిబ్బంది లేకపోవడంతో చాలావరకు పాఠశాలలు మూత పడుతున్నాయి.

1,120 మంది ఉపాధ్యాయులు..

షాద్‌నగర్ నియోజకవర్గంలోని 284 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 1,120 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అందులో ఫరూఖ్‌నగర్‌లోని 96 స్కూళ్లలో 469 మంది, కేశంపేటలోని 44 పాఠశాలల్లో 195 మంది, కొందుర్గులో 35 పాఠశాలల్లో 93 మంది, చౌదరిగూడలో 40 పాఠశాలకు గాను 94 మంది, నందిగామలో 36 పాఠశాలలు ఉండగా 135 మంది, కొత్తూరులో 33 స్కూళ్లకుగాను 134 మంది విధులకు హాజరవుతున్నారు.

ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు..

పల్లెల్లో పాఠాలను బోధించే ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై పట్టణాలకు వెళ్తుండంటతో ఆయా పాఠశాలల్లో సబ్జెక్టు బోధించే వారు లేకపోవడంతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. సబ్జెక్టుతో సంబంధంలేని టీచర్లు పాఠాలు చెబుతుండటంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు సిలబస్ కూడా పూర్తికాకపోవడంతో చేసేదిలేక విద్యార్థుల తల్లిదండ్రులు వారిని మరో పాఠశాలలో చేర్పిస్తున్నారు. దీంతో పాఠశాలలకు విద్యార్థులు రాకపోవడంతో పలు స్కూళ్లు ఇప్పటికే మూతపడ్డాయి.

డిప్యూటేషన్‌పై 50 మంది..

షాద్‌నగర్ నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల నుంచి దాదాపు 50 మంది ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై వెళ్లారు. తమకు అనుకూలంగా ఉన్న నగర శివార్లలోని పాఠశాలలను ఎంచుకొని డిప్యూటేషన్ పెట్టుకుంటున్నారు. పల్లెల్లో పాఠాలను బోధించాల్సిన వారు పట్టణ ప్రాంతాలకే పరిమితమవుతున్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలో 20 మంది, కేశంపేట మండలంలో 10 మంది, కొత్తూరు మండలంలో 6 మంది, నందిగామ మండలంలో 5 మంది, చౌదరిగూడ మండలంలో నలుగురు, కొందుర్గులో ముగ్గురు డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు వెళ్లారు. అయితే వారు పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో విధులకు హాజరవుతున్నప్పటికీ వేతనాలు మాత్రం పల్లె పాఠశాలల్లోనే తీసుకుంటున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించి పల్లెల్లోని ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయులు పాఠాలు బోధించేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు కోరుతున్నారు. లేదంటే గ్రామీణ విద్యార్థుల భవితవ్యం అంధకారం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల మూతపడింది



మా తండాకు టీచర్ రావడంలేదు. అడిగితే సెలవులో ఉన్నారన్నారు. విద్యాశాఖ అధికారులు మరొక టీచర్‌ను నియమించారు. అయితే ఆ టీచర్ పాఠశాలకు సక్రమంగా రాకపోవడంతో మా పిల్లలు బడికి పోవడంలేదు. ఈ క్రమంలో మా తండా పాఠశాల మూతపడింది. చేసేది లేక పిల్లలను వెల్జర్లకు పంపుతున్నాం. మరికొంతమంది అంతదూరం పంపించలేక పిల్లలను చదువు మాన్పిస్తున్నారు.

– శివకుమార్, విద్యార్థి తండ్రి, తోకరేగడితాండ, ఫరూఖ్‌నగర్

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే..



గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతోనే ఉపాధ్యాయులు డిప్యూటేషన్‌పై ఇతర పాఠశాలలకు వెళ్లారు. విద్యార్థుల సంఖ్యకు సరిపడా టీచర్లు ఉన్న చోట మాత్రమే డిప్యూటేషన్ కల్పించాం. అర్బన్ ప్రాంతంలో టీచర్లు తక్కువగా ఉండటంతో ఇక్కడి నుంచి వెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రభుత్వ బడుల్లో గడువు మేరకు సిలబస్ కంప్లీట్ చేస్తున్నాం.

– శంకర్‌రాథోడ్, మండల విద్యాధికారి, ఫరూఖ్‌నగర్



కలెక్టర్‌కు కేక్ తినిపిస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు

అంకితభావంతో పనిచేయాలి

- కలెక్టర్ శశాంక

ఇబ్రహీంపట్నం రూరల్: ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి కూలీలకు పని కల్పించాలని కలెక్టర్ శశాంక సూచించారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో ఉపాధి హామీ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ నాగభూషణం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, అడిషనల్ పీడీ నీరజ ఈ వేడుకల్లో పాల్గొని కేక్ కట్‌చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఉపాధి ఉద్యోగులు గ్రామాల్లో ప్రతి కార్డుదారుడికి 100రోజులు పని కల్పించాలన్నారు. భూగర్భ జలాలు పెంపొందించే దిశగా పనులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఉద్యోగుల ఐక్య కార్యచరణ కమిటీ ప్రధాన కార్యదర్శి తిరుపతిచారీ, ఏఓ శారద, సూపరింటెండెంట్ ప్రసాద్, హెచ్‌ఆర్ మేనేజర్ సంపత్, ఉద్యోగ సంఘం నాయకులు శివశంకర్, వెంకట్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రుల ఇళ్లను ముట్టడిస్తాం

- సీఎంహోం వద్ద కానిస్టేబుల్ అభ్యర్థుల ఆందోళన

హుడాకాంప్లెక్స్: అసెంబ్లీ ఎన్నికల సమయంలో జీఓ నం.46ను రద్దుచేస్తానని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ఇప్పుడు తీరా అధికారంలోకి వచ్చాక మాట మారుస్తోందని కానిస్టేబుల్ అభ్యర్థులు ఆరోపించారు. ఈ మేరకు సరూర్‌నగర్ మండలంలోని విక్టోరియా మెమోరియల్ గ్రౌండ్‌లో వారు శుక్రవారం ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రెండు, మూడు రోజుల్లో ప్రభుత్వం నుంచి జీఓ నం .46కు సంబంధించి అనుకూల ప్రకటన రాకపోతే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరి ఇదే విధంగా కొనసాగితే వచ్చే ఎమ్మెల్సీ, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రజల్లో తిరగనివ్వం అన్నారు. వెంటనే సానుకూల నిర్ణయం తీసుకొని న్యాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న సరూర్‌నగర్ పోలీసులు విక్టోరియా మెమోరియల్‌కు చేరుకుని అభ్యర్థులకు సర్ది చెప్పటంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో మహేష్, అనిల్, ప్రవీణ్, ఆకాశ్, శంకర్, మధు, వెంకట్, రాముడు, శ్రీకాంత్, వసంత్ తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థులతో మాట్లాడుతున్న పోలీసులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం నాయకులు

సమ్మెను విజయవంతం చేయండి

రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్

కందుకూరు: కార్మిక హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఫిబ్రవరి 16న చేపట్టనున్న దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రాంచందర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని నేదునూరులో శుక్రవారం సంయుక్త కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాంచందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో కార్పొరేట్ శక్తులైన అదానీ, అంబానీలకే పెద్ద పీట వేసిందన్నారు. మరోవైపు పేదలపై పన్నుల భారంమోపుతోందన్నారు.నల్లచట్టాల పేరుతో రైతులను ఇబ్బంది పెట్టాలని చూస్తోందన్నారు.56 కార్మి క చట్టాలను తొలగించి కేవలం వాటిని నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చడంతో పాటు పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచారన్నారు. ఈ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించనున్న గ్రామీణ బంద్‌లో ప్రజలందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ స భ్యుడు కుమార్,నాయకులు శ్రీరాములు,సాయిలు, యాదయ్య, వెంకటయ్య, జగన్, ఆంజనేయులు, బాలయ్య,నర్సింహ,జంగయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన సేవలు

- జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు
- చేవెళ్ల ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి పరిశీలన

చేవెళ్ల: ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యవిధాన పరిషత్ అధికారి రాజు అన్నారు. చేవెళ్లలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిని శుక్రవారం వారు తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డుల్లో రోగులను కలిసి వైద్యసేవలు ఎలా అందుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్యులు సక్రమంగా ఉండటం లేదనే విమర్శల నేపథ్యంలో ఇక్కడనుంచి డిప్యుటేషన్‌పై వెళ్లిన వైద్యులను తిరిగి తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని వైద్యాధికారులు తెలిపారు. ఆస్పత్రిలో ప్రతిరోజు ఓపీకి 200లకు పైగా రోగులు వస్తారని వారికి ఆస్పత్రి ఆవరణలో సరిపడా మరుగుదొడ్లు లేవని సిబ్బంది వారి దృష్టికి తీసుకురావటంతో వాటిని వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. ల్యాబ్‌లో అత్యవసరమైన సీబీపీ పరీక్షలు చేసే యంత్రం లేదని చెప్పటంతో దానికి సంబంధించిన నివేదికను అందించాలని వైద్యులకు సూచించారు. వారి వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్, ఆస్పత్రి ఇన్‌చార్జి సోమశేఖర్, వైద్యులు లక్ష్మీకాంత్ రెడ్డి, సిబ్బంది ఉన్నారు.



కమ్యూనిటీ ఆస్పత్రిని పరిశీలిస్తున్న వైద్యాధికారులు

428 మంది నర్సుల నియామకం...

ప్రభుత్వం ఇటీవల ఎంపిక చేసిన స్టాఫ్‌నర్సుల నియామకాల్లో జిల్లాకు 428 మంది కొత్త స్టాఫ్ నర్సులు వచ్చారని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్ రావు తెలిపారు. ఈ నియామకాలతో జిల్లాలోని ఆయా ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న స్టాఫ్‌నర్సుల పోస్టులు భర్తీకానున్నట్లు తెలిపారు. ఇందులో 315 మంది జిల్లా ఆరోగ్యశాఖ పరిధిలో ఉండగా 55 మంది వైద్యవిధాన పరిషత్ ఆస్పత్రులకు, 18 మంది మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాలకు, 11 మంది మైనార్టీ గురుకులాలకు, 14 మంది ఎంఎన్‌జే క్యాన్సర్ ఆస్పత్రికి, 13 మంది గిరిజన గురుకుల పాఠశాలలకు, ఇద్దరిని ఎస్సీ గురుకుల పాఠశాలలకు కేటాయించటం జరిగిందన్నారు. వీరికి పోస్టింగ్‌లు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. దీంతో ఆసుపత్రిలో కొత్తగా వచ్చే సిబ్బందితో ఆయా ఆస్పత్రుల్లో మరింత మెరుగైన వైద్యసేవలు అందుతాయని చెప్పారు.

పర్యావరణ సమతుల్యతను కాపాడుదాం

- మంత్రి కొండా సురేఖ
- వెట్ ల్యాండ్ డేలో పాల్గొన్న మంత్రి
- ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని సూచన

మణికొండ: పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి తోడు ప్రజలు, స్వచ్ఛంద సంస్థల తోడ్పాటునందించాల్సిన అవసరం ఎంతో ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ చిన్నచెరువు వద్ద పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ, రాష్ట్ర జీవవైవిధ్య బోర్డు, ధృవాన్ష్ సంస్థల ఆధ్వర్యంలో చిత్తడి నేలల దినోత్సవం (వెట్ ల్యాండ్ డే) కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్తడి నేలలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన స్టాళ్లను పరిశీలించి మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ, చిత్తడి నేలల సంరక్షణకు అనుసరించాల్సిన విధానాలపై మంత్రి మాట్లాడారు. పూర్వకాలంలో కాలుష్యం ఉండేది కాదని, జనాభా పెరుగుతున్న కొద్దీ ప్రజలు అవగాహన లేమితో బాధ్య తారహితంగా ప్రవర్తిస్తుండటంతో అది పెరుగుతోందన్నారు. అప్పట్లో రసాయనాలు లేని ఆహారం తినటంతో ఎలాంటి అనారోగ్య సమస్యలు లేకుండా జీవించారని, ప్రస్తుతం 30 సంవత్సరాల వయసుకే బీపీ, షుగర్, కాళ్ల నొప్పు లు అంటూ అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రజలు తమ ఇళ్లు శుభ్రంగా ఉంటే చాలనే దృక్పథం నుంచి సామాజిక బాధ్యతతో పరిసరాలతో పాటు వీధి, గ్రామం, రాష్ట్రం, దేశం పరిశుభ్రంగా ఉండాలనేలా జీవించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌తో పర్యావ రణానికి తీవ్ర అనర్థం జరుగుతోందని, వాటికి బదులు పేపర్ బ్యాగులను వాడాలన్నారు. మనం ఇతరులకు ఏదైనా చెప్పే ముందు ఆచరించాలన్నారు. అన్ని రకాల జీవరాశులు ఆరోగ్యంగా జీవించినపుడే మనం సైతం ఆరోగ్యంగా ఉంటామన్నారు. కార్యక్రమంలో అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డ్ కార్యదర్శి కాళీచరణ్, ఎం.సునీల, శిల్పాశర్మ, ధృవాన్ష్ ప్రతినిధి మధులిక, పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

జోనల్ కార్యాలయానికి సరెండర్

విధుల్లో అలసత్వమే కారణం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో టౌన్ ప్లానింగ్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఓ చైన్‌మన్‌తో పాటు మరో కాంట్రాక్ట్ ఉద్యోగిని శుక్రవారం ఉప కమిషనర్ రవికుమార్ జోనల్ కార్యాలయానికి సరెండర్ చేశారు. విధుల్లో అలసత్వం ప్రదర్శించడంతో పాటు కూల్చివేతల విషయాలను ముందస్తుగా సంబంధిత యజమానులకు సమాచారం అందించడం, ఆక్రమణదారులతో కలిసి కొందరికి మాత్రమే నోటీసులు అందించడం తదితర విషయాలపై విచారణ జరిపిన అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో చైన్‌మన్ సత్యనారాయణ, కాంట్రాక్ట్ ఉద్యోగి వెంకన్నలు టౌన్‌ప్లానింగ్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకుని నోటీసులు అందించడం వీరి విధి. కాగా.. డివిజన్ పరిధిలో పలు అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. ఇందిరా గాంధీ సొసైటీలో భారీషెడ్‌ల నిర్మాణాలు చేపట్టారని గుర్తించారు. గతంలోనూ వీరికి నోటీసులు ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారి నోటీసులు జారీ చేశారు. కానీ చైన్‌మన్ సత్యనారాయణ, వెంకన్నలు కొందరికి నోటీసులు అందించి మరికొందరికి అందించలేదు. టౌన్ ప్లానింగ్ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బందితో కూల్చివేతలు సిద్ధం కాగా.. ఈ విషయాన్ని ముందుగానే అక్రమదారులకు వీరిద్దరూ సమాచారం అందించారు. కూల్చివేతలకు సిద్ధమవుతుండగా వివిధ పార్టీల ప్రజా ప్రతినిధుల నుంచి అధికారులకు ఒత్తిళ్లు ప్రారంభమయ్యాయి. వాటిని అధిగమించి అధికారులు కూల్చివేతలు కొనసాగించారు. పలువురు యజమానులు చైన్‌మన్ సత్యనారాయణతో పాటు వెంకన్నపై బహిరంగంగా ఫిర్యాదులు చేశారు. నోటీసులు సైతం అందించలేదని వెల్లడించారు. విచారణ జరిపిన అధికారులు ఈ విషయాన్ని ఉప కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉప కమిషనర్ రవికుమార్ శుక్రవారం ఇరువురినీ జోనల్ కార్యాలయానికి సరెండర్ చేశారు.

పోగొట్టుకున్న సొత్తు అందజేత



శశికళకు వస్తువులను అందజేస్తున్న సీఐ శివప్రసాద్, సిబ్బంది

పోలీసులకు కృతజ్ఞతలు తెలిపిన బాధితురాలు

కద్తాల్: కారులో పోగొట్టుకున్న విలువైన వస్తువులతో కూడిన బ్యాగ్‌ను కద్తాల్ పోలీసులు స్వాధీనం చేసుకుని, బాధితురాలికి అప్పగించారు. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం హుబ్లీకి చెందిన శశికళ అనే మహిళ, గత ఏడాది డిసెంబర్ 23న ధ్యాన మహాయాగంలో పాల్గొనేందుకు అద్దె కారులో మహేశ్వర మహాపిరమిడ్‌కు వచ్చింది. ఈ క్రమంలో వాహనం దిగి, అందులోనే తన బ్యాగును మర్చిపోయింది. దీంతో ఆమె పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన ఏఎస్‌ఐ నిరంజన్, కానిస్టేబుల్ దివ్యవాణి, సిబ్బంది, కారు డ్రైవర్ నంబర్‌ను ట్రేస్ చేసి, బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాధితురాలు శశికళను రప్పించి, శుక్రవారం స్థానిక ఠాణాలో ల్యాప్‌టాప్, 3 బంగారు ఉంగరాలు, లాకెట్, డైమండ్ చెవికమ్మలు, మ్యాట్నీలు, చార్జెస్ ఈయర్‌బర్డ్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా బాధితురాలు శశికళ మాట్లాడుతూ, పోగొట్టుకున్న రూ.4 లక్షల విలువ గల వస్తువులను తిరిగి అప్పగించినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి, సకాలంలో సొత్తు రికవరీ చేసినందుకు పోలీసు ఉన్నతాధికారులు సిబ్బందిని అభినందించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు హరిశంకర్‌గౌడ్, వరప్రసాద్, ఏఎస్‌ఐ నిరంజన్, కానిస్టేబుల్ దివ్యవాణి ఉన్నారు.

రేపు ఇంటర్ ప్రవేశ పరీక్ష

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల ప్రతిభ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 4న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు కమ్మదనం గురుకుల సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత శుక్రవారం ఒకప్రకటనలో తెలిపారు. గురుకులాల సంస్థ కార్యదర్శి డాక్టర్ నవీన్‌నికోలస్ ఆదేశాల మేరకు సీఓఈ సెట్ 2024–25 విద్యా సంవత్సరానికి.. పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధి కమ్మదనం గురుకుల కళాశాలలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పరీక్ష ఉంటుందని వెల్లడించారు. ఇందుకు పదో తరగతి చదివే విద్యార్థులు అర్హులని, దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం 9గంటల వరకు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. విద్యార్థులు తప్పని సరిగా తమ వెంట ఆధార్ కార్డు, పాఠశాల సంబంధిత బోనఫైడ్, బ్లూ, బ్లాక్ పెన్ను, హాల్‌టికెట్, పరీక్ష ప్యాడ్ తెచ్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రిక్ పరికరాలు అనుమతించబడవని తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

యాచారం: బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కేసు లు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సైదయ్య హెచ్చరించారు. నందివనపర్తి, మొండిగౌరెల్లి, మాల్ తదితర గ్రామాల్లో శుక్రవారం బెల్టు దుకాణాలపై పోలీసులు దాడులు నిర్వహించి, 15 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు.

ఎన్‌జీటీ ఆదేశాల అమలుపై సమీక్ష

సనత్‌నగర్: నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల అమలుతో పాటు పలు కీలకాంశాలపై శుక్రవారం సనత్‌నగర్‌లోని పీసీబీ కార్యాలయంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సమీక్షించారు. పర్యావరణ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వాణీప్రసాద్ ఆయా అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించి దిశానిర్దేశం చేశారు. మేడారం జాతరలో పర్యావరణ శాఖ తరుపున చేపట్టాల్సిన అంశాలు, రాష్ట్రంలో గాలి నాణ్యతను మెరుగుపరచడం, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలను పకడ్బందీగా అమలుచేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నియంత్రణ, కాలుష్య నియంత్రణ చర్యలపై చర్చించారు. నిర్మా వ్యర్థాల నిర్వహణ, రాష్ట్రంలో మురుగునీటి శుద్ధి, పీయూసీ యంత్రాల పనితీరుపై చర్చించి వాటిని సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పీసీబీ సభ్యకార్యదర్శి బుద్ధప్రకాష్ జ్యోతి, బోర్డు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

‘దేవుడి భూములనూ వదలడం లేదు’

- రైతుల భూములు గుంజుకొని రియలెస్టేట్ వ్యాపారం
- బీఆర్‌ఎస్ నేతలపై మాజీ ఎంపీ కొండా ఫైర్
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను బొందపెట్టాలని పిలుపు
- దేశవ్యాప్తంగా అత్యధిక స్థానాలు బీజేపీ కైవసం చేసుకుంటుందని ధీమా



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి

షాబాద్: చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, మాజీ మంత్రి కేటీఆర్ ఇద్దరూ కలిసి నగరంలోని హనుమాన్ దేవాలయాన్ని కూల్చివేసి, ఆ భూమిని కబ్జా చేశారని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంలు ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ గార్డెన్‌లో బూత్ కమిటీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. షాబాద్ మండలం చందనవెల్లి భూములను బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. రైతుల నుంచి గుంజుకుని, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసిందని విమర్శించారు. సీతారాంపూర్ దేవాలయ భూములనూ వదలలేదని మండిపడ్డారు. ఈ స్థలాలను ఆ పార్టీ నేతలు వివిధ పరిశ్రమలకు కట్టబెట్టి, కోట్లు దండుకున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం దేవాలయాలను పరిరక్షిస్తుంటే.. బీఆర్‌ఎస్ నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు భూకబ్జాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. చేవెళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ సమావేశం నిర్వహిస్తే.. ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు కొంత మంది ముఖ్య నాయకులు గైర్హాజరైనట్లు తెలిపారు.

ఆ పార్టీలను బొంద పెట్టాలి..

రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను బొంద పెట్టాలని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా, మాజీ ఎమ్మెల్యే కేఎస్ పిలుపునిచ్చారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని, దేశవ్యాప్తంగా 350 కన్నా ఎక్కువ సీట్లను దక్కించుకుంటుందని ధీమా వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్రకు అన్నీ అపశృతులే ఎదురవుతున్నాయని, ప్రజలు ఆ పార్టీని నమ్మేస్థితిలో లేరని ఎద్దేవా చేశారు.

పనిచేసే వారికే ప్రాధాన్యత

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో కొందరు నేతలు హడావుడి చేస్తున్నారని, ఈ ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ నియోజకవర్గ పరిధిలో పార్టీ అధిష్టానం తీసుకునే నిర్ణయమే శిరోధార్యమన్నారు. పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, అసెంబ్లీ కౌన్సిల్ సభ్యుడు ప్రతాప్‌రెడ్డిలు మాట్లాడుతూ.. బీజేపీలో ముందు నుంచి కష్టపడిన వారికే ప్రాధాన్యత ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కిరణ్, నాయకులు రాము, మహేందర్, నారాయణ, రవీందర్‌రెడ్డి, మాణెయ్య, సత్యం, గోపాల్, మహేశ్, హరీష, శ్రీనివాస్, రాఘవేందర్, ప్రమోద్‌కుమార్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, నర్సింహులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో ఫ్రెండ్లీగా ఉండాలి

షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి

కద్తాల్: విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు.. సమస్యలతో ఠాణాకు వచ్చిన ఫిర్యాదు దారులతో స్నేహపూర్వకంగా ఉండాలని షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఠాణా పరిధిలో నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. పోలీసులు శాంతిభద్రతల పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. సీపీ అవినాశ్ మహంతి ఆదేశాల మేరకు సోదాలు నిర్వహిస్తున్నామని, ఎప్పటికప్పుడు రికార్డులను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌ఓ శివ ప్రసాద్, ఎస్‌ఐ హరిశంకర్‌గౌడ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ రంగస్వామి

జల్సాలకు అలవాటు పడి.. జీవాల చోరీ

- ముగ్గురు నిందితుల అరెస్ట్
- మూడు కార్లు, నగదు స్వాధీనం



పోలీసుల అదుపులో మేకల దొంగలు స్వాధీనం చేసుకున్న కార్లు

మహేశ్వరం: జల్సాలకు అలవాటు పడి, జీవాలను ఎత్తుకెళ్తున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. గాజులయ తండా, కనుమునూరు గ్రామం, మరికల్ మండలం, నారాయణపేట్ జిల్లాకు చెందిన డేగావత్ ప్రభాకర్ నాయక్, శివ కుమార్, శంకర్‌లు దురలవాట్లకు అలవాటు పడి, తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే దురాలోచనతో దొంగతనాలకు వృత్తిగా ఎంచుకున్నారు. ఈ క్రమంలో అమీర్‌పేట్, మాణిక్యమ్మగూడ, దిల్‌వార్‌గూడ గ్రామాల్లో రాత్రి వేళల్లో గొర్రెలు, మేకల దొంగతనాలకు పాల్పడ్డారు. శుక్రవారం తెల్లవారు జామున 4 గంటలకు మండల పరిధి చిన్నతూప్ర గ్రామంలో జీవాలను ఎత్తుకెళ్తుండగా.. స్థానికులు పట్టుకొని పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ముగ్గురు వ్యక్తులను, మూడు కార్లు, రూ.1.50లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉండగా.. ఎత్తుకెళ్లిన గొర్రెలు, మేకలను కార్లలో హైదరాబాద్‌లోని జియాగూడ మటన్ మార్కెట్‌కు తీసుకెళ్లి, విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడయింది. ఈ సందర్భంగా కేసు విచారణలో చొరవ చూపిన ఎస్‌ఐ సుబ్బారెడ్డి, క్రైం కానిస్టేబుళ్లను సీఐ అభినందించారు.

మంత్రికి ఘన స్వాగతం

షాద్‌నగర్ రూరల్: వనపర్తి జిల్లాలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నిర్వహించే రోడ్‌షోకు వెళ్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్ షాద్‌నగర్ పట్టణ సమీపంలోని బెంగుళూరు జాతీయ రహదారి వద్ద ఘన స్వాగతం పలికారు. పూలబొకే అందజేసి ఘనంగా సన్మానించారు. అనంతరం వనపర్తి జిల్లా ఆత్మకూరులో చల్లా వంశీచందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి వీర్లపల్లి శంకర్ తరలివెళ్లారు. కాగా పార్లమెంట్ ఎన్నికలు సమీస్తున్న వేళ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఇప్పటికే రోడ్‌షోలు, సభలతో నిత్యం ప్రజల్లో ఉంటున్నారు. గెలుపే లక్ష్యంగా పనిచేయాలని క్యాడర్‌కు ఆ పార్టీ నేతలు దిశానిర్దేశం చేశారు.



ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సన్మానించిన వీర్లపల్లిశంకర్

ఎంపీ పరామర్శ

చేవెళ్ల: అనారోగ్యంతో సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను శుక్రవారం ఎంపీ రంజిత్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల లోబీపీతో ఇంట్లో కాలుజారి పడిపోయిన ఎమ్మెల్యే కాలె యాదయ్య.. యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న ఎంపీ.. త్వరగా కొలుకొని పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజల్లోకి రావాలని సూచించారు.



యాదయ్యను పరామర్శిస్తున్న రంజిత్‌రెడ్డి

టీఎస్ ఆర్టీసీకి రూ.21.72 కోట్లు టోకరా!

- యాడ్ ఏజెన్సీ నిర్వాహకుడి వ్యవహారం
- కటకటాల్లోకి పంపిన సీసీఎస్ పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెల్లించాల్సిన రూ.21.72 కోట్లు చెల్లించకుండా మోసం చేసిన కేసులో యాడ్ ఏజెన్సీ నిర్వాహకుడు వి.సునీల్‌ను హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. వివిధ ప్రాంతాల్లోని యాడ్ స్పేస్‌ను వినియోగించుకున్న అతను, టీఎస్ ఆర్టీసీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన మొత్తం ఎగవేసినట్లు టీమ్–5 ఏసీపీ బి.బాబురావు తెలిపారు. చింతల్ ప్రాంతానికి చెందిన సునీల్ తన భార్య మృదులతో కలిసి గో రూరల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో యాడ్ ఏజెన్సీ నిర్వహిస్తున్నాడు. ఐదేళ్ల క్రితం టెండర్ల ద్వారా టీఎస్ ఆర్టీసీ హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్లకు చెందిన యాడ్ స్పేస్‌ను పొందాడు. దీనిని వివిధ సంస్థల ప్రకటనల కోసం అద్దెకు ఇచ్చే ఇతగాడు.. భారీ మొత్తం ఆర్జించాడు. ఆర్టీసీతో చేసుకున్న ఒప్పందం ప్రకారం సునీల్ ప్రతి నెలా రూ.40 లక్షల చొప్పున సంస్థకు చెల్లించాల్సి ఉంది. దీనికి గ్యారంటీగా ముందుగానే రూ.3 కోట్లు ఆర్టీసీ వద్ద డిపాజిట్ చేశాడు. తొలినాళ్లలో నామమాత్రపు చెల్లింపులు చేసిన సునీల్.. ఆపై మొండికేశాడు. కోవిడ్, లాక్‌డౌన్ తదితరాల వలన ఆశించిన ఆదాయం రాలేదని, కొన్ని బస్సులు తిరగకపోవడంతో యాడ్స్ తగ్గాయని ఆర్టీసీ అధికారులకు చెప్పుకొచ్చాడు. 2021లో రూ.కోటి విలువైన చెక్కులు ఇచ్చినా బ్యాంకు ఖాతాలో నగదు లేకపోవడంతో అవి బౌన్స్ అయ్యాయి. దీనిపై ఆర్టీసీ అధికారులు సునీల్‌ను సంప్రదించి వివరణ కోరడంతో పాటు చెక్‌బౌన్స్ కేసు వేస్తామని స్పష్టం చేశారు. ఆ సమయంలో రెండు రీజియన్ల అధికారులకు లేఖలు రాసిన సునీల్, చెక్‌బౌన్స్‌పై ఎలాంటి న్యాయపరమైన చర్యలు తీసుకోవద్దని, త్వరలోనే ఆర్టీసీకి చెల్లించాల్సిన మొత్తం ఇచ్చేస్తానంటూ హామీ ఇచ్చాడు. సంస్థకు నగదు జమ కావాలనే ఉద్దేశంతో ఆర్టీసీ అధికారులు సైతం ఈ మేరకు అవకాశం ఇచ్చారు. అయితే ఇటీవల కాలంలో ఆర్టీసీ అధికారులను సునీల్ బేఖాతరు చేయడం మొదలెట్టాడు. ప్రకటనల ద్వారా అతడు మాత్రం ఆదాయం పొందుతూ.. ఆర్టీసీకి చెల్లించాల్సిన రూ.21.72 కోట్లు ఎగ్గొట్టాడు. దీంతో అధికారులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దర్యాప్తు చేసిన పోలీసులు శుక్రవారం సునీల్‌ను అరెస్టు చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.